నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 14 జూన్ 2025 | VIKARABAD

నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు పంజాగుట్టలోని నిమ్స్ దవాఖానకు వస్తుంటారు. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నిమ్స్ ప్రవేశ ద్వారం చెరువులా మారిపోయింది. దారిలో వరదనీరు నిలిచిపోవడంతో రోగులు, వారి బంధువులు ఇబ్బందిపడ్డారు. -ఖైరతాబాద్

శుక్రవారం హైదరాబాద్ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిచందన దాసరి

మళ్లీ అప్పు చేయాల్సిందే



ఇంకా అందని రైతుభరోసా పెట్టుబడి సాయం

- వానకాల పంటల సాగుకు సిద్ధమైన రైతన్న
- దుక్కులు దున్ని.. ఎరువులు, విత్తనాల కొనుగోలుకు సిద్ధంగా ..
- అందని పెట్టుబడి సాయం, బోనస్ డబ్బులు
- ఇప్పుడూ వడ్డీ వ్యాపారులు, దళారులే దిక్కు

రంగారెడ్డి, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వానకాల పంటల సాగుకోసం అన్నదాత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుభరోసా పెట్టుబడి సాయం, బోనస్ డబ్బులు రాక పోవడంతో పంటల సాగుకు మళ్లీ వడ్డీ వ్యాపారులు, దళారుల వద్ద అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గత యాసంగిలో అతివృష్టి, అనావృష్టితో అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడి కూడా రాలేదు. జిల్లాలో వర్షాకాల పంటల సాగు ప్రారంభమైంది. ఇప్పటికే కొందరు రైతులు పొలాలను దున్ని నారు కూడా పోశారు. మెట్ట పంటలు వేసేందుకు దుక్కులను సిద్ధం చేసుకుని విత్తనాలు, ఎరువులు కొనేందుకు సమయం వచ్చిం ది. కానీ, ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుభరోసాకు దిక్కేలేదు. గత యాసంగిలో సన్న వడ్లకు రావాల్సిన బోనస్ కూడా ఇప్పటివరకూ అందలేదు. ఈ పరిస్థితిలో అన్నదాత పంటల సాగుకోసం దళారులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయక తప్పడం లేదు.

రైతు భరోసా అందించాలి..

గత బీఆర్ఎస్ హయాంలో పంటల సాగుకు ముందే రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం అందేది. దీంతో అన్నదాతలు ఎరువులు, విత్తనాలను సకాలంలో సమకూర్చుకునేది. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం పంపిణీ సరిగ్గా సాగడంలేదు.. పంపిణీలో పూర్తిగా విఫలమైంది. -అచ్చన శ్రీశైలం

బోనస్ డబ్బులు చెల్లించాలి

సన్న వడ్లు పండిస్తే అన్నదాతకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు ఆ బోనస్ డబ్బులను చెల్లించడంలేదు. చాలామంది రైతు లు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. యాసంగికి సంబంధించిన బోనస్ డబ్బులను వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలి. -మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి

పండిన పంట వాళ్లకిస్తేనే అప్పు..

వడ్డీ వ్యాపారులు, దళారులను అప్పుల కోసం ఆశ్రయిస్తున్న రైతులకు వారు పలు రకాల షరతులు పెడుతున్నారు. చేతికొచ్చిన పంటను తమకు విక్రయిస్తామని చెబితేనే విత్తనాలు, ఎరువులకు డబ్బులు ఇస్తున్నారు. అంతేకాకుండా తాము ఇచ్చిన విత్తనాలనే వాడాలని నిబంధనలు పెడు తున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పత్తి విత్తనాల విక్రయదారులు కూడా పెరిగిపోయారు.

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 3,24,000 మంది రైతులున్నారు. వీరు వరి, పత్తి, ఆముదం, మొక్కజొన్న, జొన్నలు, ఇతర కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. గత యాసంగిలో 1,25,000 ఎకరాల్లో పంటలను సాగు చేయగా.. వాతావరణ పరిస్థితులు అనుకూలించక వరిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాకాల పంటల కోసం జిల్లాలోని రైతులకు సుమారు రూ.300 కోట్లకు పైగా రైతు భరోసా రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ రూపాయీ రాలేదు. అలాగే, సుమారు రూ. 10 –రూ.15 కోట్ల వరకు సన్న వడ్లపై బోనస్ అందాల్సిన ఉన్నది. రైతుభరోసా కోసం జిల్లాలోని రైతులు వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 3,24,000 మంది రైతులు

డీలర్ల దోపిడీ..!

డీఏపీ కొరతతో అందిన కాడికి దండుకుంటున్న ఫర్టిలైజర్ డీలర్లు

- ఒక్కో బ్యాగుపై రూ.100 వరకు అధికంగా వసూలు
- డీఏపీ బ్యాగుకు రూ.1,350గా నిర్ణయించిన ప్రభుత్వం
- రైతుల నుంచి రూ.1,420 నుంచి రూ. 1,450లకు తీసుకుంటున్నట్లు సమాచారం.
- 20-20 మసాలా ఎరువు తీసుకుంటేనే డీఏపీ ఇస్తామంటూ పేచీ..
- వికారాబాద్ జిల్లాలో 27,000 మెట్రిక్ టన్నులు అవసరమని వ్యవసాయాధికారులు అంచనా
- ఇప్పటివరకు వచ్చింది కేవలం 2,609 మెట్రిక్ టన్నులే..
- డీఏపీ కోసం డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ.. దోపిడీకి గురవుతున్న అన్నదాతలు

వికారాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రైవేట్ డీలర్లు ఎరువుల విక్రయంలో దోపిడీకి పాల్పడుతున్నారు. డీఏపీ కొరతను ఆసరాగా చేసుకుని అందిన కాడికి దండుకుంటున్నారని రైతులు ఆరోపిస్తు న్నారు. ఒక్కో బ్యాగుపై రూ. 100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని చెప్తున్నారు. ప్రభుత్వం ఒక్కో బ్యాగు డీఏపీ ధరను రూ.1,350గా నిర్ణయించగా ప్రైవేట్ డీలర్లు మాత్రం రూ.1,420 నుంచి రూ.1,450 లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రైవేట్ డీలర్లు అధిక ధరకు డీఏపీని విక్రయిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతోనే వారి ఆటలు సాగుతున్నాయని.. ఇష్టారాజ్యంగా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. డీఏపీతోపాటు 20–20 మసాలా ఎరువు కూడా కొనాలని రైతులకు బలవంతంగా అంటగట్టుతున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విత్తనాలను నాటేందుకు సిద్ధమైన రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో డీలర్లు చెప్పిన రేట్‌కే ఎరువులను కొంటున్నారు.

జిల్లాకు పది శాతం మాత్రమే సరఫరా..

జిల్లాలో వర్షాలు ప్రారంభమై అన్నదాత సాగుకు సన్నద్ధమైనా ప్రభుత్వం మాత్రం ఎరువులు, విత్తనాలను సమకూర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. విత్తనాలు నాటేందుకు అవసరమయ్యే డీఏపీ ఎరువు స్టాక్ జిల్లాకు కేవలం పది శాతం మాత్రమే వచ్చింది. వచ్చింది.. వచ్చినట్లు అయిపోవడంతో డీఏపీ కొరత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు విత్తనాలను నాటేందుకు సిద్ధమైన అన్నదాతకు ఎక్కడికెళ్లినా డీలర్లు డీఏపీ లేదని చెబుతున్నారు. డీఏపీ కోసం రైతులు జిల్లా అంతటా డీలర్ల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే డీఏపీ కోసం రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొనే ప్రమాదమూ లేకపోలేదు. జిల్లాలో వానకాలానికి 27,000 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరమని వ్యవసాయాధికారులు అంచనా వేయగా.. ఇప్పటివరకు కేవలం 2,609 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు వచ్చింది. మిగతా స్టాక్ ఎప్పుడు వస్తుందనేది సంబంధిత శాఖ అధికారులకు కూడా చెప్పలేకపోతున్నారు. అదేవిధంగా జిల్లాకు యూరియా 39,000 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటివరకు 8,263 మెట్రిక్ టన్నులు మాత్రమే రాగా.. పోటాషియం 8,000 మెట్రిక్ టన్నులకుగాను 175 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాలో అందుబాటులో ఉన్నది.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు..

ఎరువులను అధిక రేటుకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. డీఏపీ, యూరియా తదితర ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలి. డీలర్లు ఎక్కువ ధరకు అమ్మినట్లు రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే జిల్లాకు డీఏపీ స్టాక్ వస్తుంది.
- మోహన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

క్యా మతలబ్ హై..?

గంజాయి చాక్లెట్ల విక్రేతలకు స్టేషన్ బెయిల్

ఏడేండ్లలోపు శిక్షలు పడే సెక్షన్లతోనే స్టేషన్ బెయిల్ అంటున్న పోలీసులు

సిటీబ్యూరో/హయత్‌నగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): పోలీసులు తలుచుకుంటే చిన్న కొట్లాట కేసులో నిందితులైన వారికి స్టేషన్ బెయిల్‌కు అవకాశమున్నా.. అరెస్ట్ చేసి కోర్టుకు పంపిస్తారు.. అదే ఎంత పెద్ద కేసైనా తమ వారు అనుకుంటే చట్టంలో ఉండే చిన్నపాటి లోపాలను ఆసరాగా చేసుకొని స్టేషన్‌లోనే బెయిల్ ఇవ్వవచ్చు.. స్టేషన్ బెయిల్ కోసం డబ్బులు డిమాండ్ చేస్తూ తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేసుల్లో నుంచి నిందితులను తొలగించడం, సెక్షన్లు తగ్గించేందుకు ప్రయత్నించి కొందరు పోలీసులు ఏసీబీకి పట్టుబడ్డ ఘటనలున్నాయి. సమాజానికి చీడపురుగులా మారిన డ్రగ్స్ మహమ్మారిని ఉక్కుపాదంతో అణచివేసేస్తామంటూ ప్రభుత్వం ఒక పక్క చెబుతున్నా కొన్ని సందర్భాల్లో క్షేత్ర స్థాయిలో తీసుకుంటున్న చర్యలు పోలీసు శాఖకు ఇబ్బందిగా మారుతున్నాయి. అందుకు డ్రగ్ స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘాను పెట్టి డ్రగ్స్ రవాణా, డ్రగ్స్ దందాలు, పబ్బులు, ఇతరాత్ర ప్రైవేట్ కార్యక్రమాల్లో డ్రగ్స్ వారే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి అమ్ముతున్న, సేవిస్తున్నా అలాంటి వారికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. అయితే పిల్లలకు గంజాయి చాక్లెట్లు విక్రయించే వారి విషయంలో మరింత సీరియస్‌గా ఉంటున్నారు. బీహార్, రాజస్థాన్ నుంచి గంజాయి చాక్లెట్లు, బంక్‌తో తయారు చేసిన చాక్లెట్లను హైదరాబాద్ శివారు ప్రాంతాలకు తెచ్చి విక్రయిస్తున్న ఘటనలున్నాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపించిన ఘటనలున్నాయి.

అయితే తాజాగా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఇద్దరు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న పిల్లలకు సంబంధించిన మత్తు చాక్లెట్లను కిరాణా షాపుల్లో విక్రయిస్తున్న నిందితుల విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంలో మతలేంటీ అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇందులో డబ్బుల లావాదేవీలు జరిగి ఉంటాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇతర ప్రాంతాల్లో గంజాయి చాక్లెట్లు పట్టుకున్న కేసుల్లో వ్యవహరించిన విధానానికి, దీనికి భిన్నంగా ఉండడంపై భిన్న రకాలుగా చర్చించుకుంటున్నారు. అయితే ఏడేండ్ల కంటే తక్కువ శిక్ష పడే కేసులు కాబట్టి స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి వచ్చిందంటూ పోలీసులు చెబుతున్నారు.

చట్టప్రకారమే నడుచుకున్నాం ..

బంగ్‌తో తయారు చేసిన చాక్లెట్లు పట్టుకున్నాం. బీహార్ నుంచి అవి వచ్చినట్లు గుర్తించాం. అవి గంజాయి చాక్లెట్లు అని ప్రచారం జరిగింది. మా వాళ్లు కూడా గంజాయి చాక్లెట్లు అని చెప్పారు. అయితే అవి బంగ్‌తో తయారు చేసినవి. తక్కువ పరిమాణంలో ఉండడంతో ఆ కేసులో శిక్షలు ఏడేండ్లలోపు ఉండే సెక్షన్లు ఉన్నాయి. ఏడేండ్లలోపు శిక్షలు పడే కేసుల్లో కోర్టులు రిమాండ్‌లు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఆ కేసులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి వచ్చింది. మాపై వచ్చిన ఆరోపణలు నిరాధరమైనవి. చట్ట ప్రకారమే అంతా నడుచుకున్నాం. -నాగరాజుగౌడ్, హయత్‌నగర్ సీఐ

రోడ్డుపై ఉన్న హరితహారం చెట్లను పూర్తిగా నరికేసిన విద్యుత్తు అధికారులు..

హరితం.. మాయం..

- కరెంట్ తీగలకు హరితహారం చెట్లు తాకుతున్నాయని మొదళ్లకే కొట్టేస్తున్న విద్యుత్తు అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు

ఇబ్రహీంపట్నం, జూన్ 13 : అడవుల శాతాన్ని పెంచి రాష్ట్రాన్ని హరితవనంగా మార్చాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటించారు. అలా నాటిన మొక్కలు గ్రామాల్లో ఏపుగా పెరిగి నేడు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పచ్చని వాతావరణాన్ని అందిస్తున్న చెట్లు విద్యుత్తు అధికారుల ఆగ్రహానికి బలవుతున్నాయి. కరెంట్ తీగలకు అవి తగులుతున్నాయన్న సాకుతో వాటిని పూర్తిగా తొలగిస్తున్నారు. విద్యుత్తు సిబ్బంది తీగలకు తగిలే కొమ్మలను నరికేయాల్సి ఉండగా.. ఆ చెట్ల మొదళ్ల వరకు పూర్తిగా తొలగిస్తుండడంతో ప్రజలు, రైతులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను పూర్తిగా తొలగించడం సరైన పద్ధతి కాదని .. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వానలు మొదలైనా కదలిక ఏదీ?

వైద్యారోగ్య శాఖ ఉదాసీనత పాంచి ఉన్న సీజనల్ ముప్పు..

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం మొదలైనా వైద్య ఆరోగ్యశాఖలో కదలిక లేదు. సీజనల్ వ్యాధుల ని వారణకు సంబంధించి ఎలాంటి ముందస్తు కార్యచరణ లేదు. అసలే ఒక పక్క కరోనా కలకలం రేపుతున్న సమయంలో సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అయోమయం నెలకొనే పరిస్థితి లేకపోలేదు. సాధారణంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి వైద్య, ఆరోగ్యశాఖ ముందస్తు కార్యాచరణను రూపొందించాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి. ఈ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దవాఖానల్లో అవసరమైన ఔషధాలు, కావాల్సిన వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీజనల్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ వానాకాలం ప్రారంభమైనా ఆరోగ్యశాఖ అధికారులు సీజనల్‌ను ఎదుర్కొనే చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

మందుల కొరతతో ఇబ్బందులు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా ఉన్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు బస్తీ దవాఖానలు సహా పలు ఇతర ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత సైతం వేధిస్తున్నట్లు స్వయంగా సిబ్బందే చెప్పడం గమనార్హం. దీనిని కొందరు అధికారులు కూడా బహిరంగంగానే ధ్రువీకరిస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యాధుల బెడద లేని సమయంలోనే ఔషధాల కొరత వేధిస్తుంటే, రానున్న సీజనల్‌ను ఎలా ఎదుర్కొంటారనేది ప్రశ్నార్థంగా మారింది. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియాతో పాటు ఫ్లూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే దవాఖానల్లో సరైన మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే సీజనల్ సమయంలో రోగుల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టెస్టుల్లేవ్..కేసుల్లేవ్

దేశమంతా కరోనా కేసులు చాపకింద నీరులా నమోదవుతున్నాయి. కానీ గ్రేటర్‌లో మాత్రం కేసులు నమోదు కావడం లేదు. ఇది శుభపరిణామమే. అసలు విషయమేంటంటే అసలు కరోనా టెస్టులు చేస్తే కదా కేసులు బయటపడేది. నగరంలో కరోనా పరీక్షలు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో చేయకపోవడంతో అసలు కేసులు నమోదుపై స్పష్టత లేదు. వైరస్ వల్ల ఎలాంటి ప్రమాదం లేకపోయినప్పటికీ, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదని ఒక పక్క వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నా.. వైరస్ నిర్ధారణకు సంబంధించి మాత్రం సంబంధిత అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం విషయంపై ముందుచూపుతో ఉండాల్సిన గ్రేటర్ వైద్య, ఆరోగ్యశాఖ సమస్య వచ్చిపడిన తరువాత మాత్రమే నిద్రలేచే విధంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీజనల్ సమయంలో మరోసారి కరోనా అలజడి సృష్టిస్తుండడంతో వచ్చిన రోగం కరోనానా లేక సీజనలా అనే అయోమయం ప్రజల్లో నెలకొనే అవకాశం లేకపోలేదు.